క్లుప్తంగా

నాయకత్వ లక్షణాలు అవసరం


విద్యార్థులతో ముఖ్యఅతిథి మాజీ మేయర్ పావని, ఏజీఎం రాఘవేంద్రరావు తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మాజీ మేయర్ సుంకర పావని తిరుమల కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక జగన్నాథపురం లోని నారాయణ పాఠశాలలో సాఫ్ట్ స్కిల్స్ విభాగం ఆధ్వర్యంలో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుంకర పావని, పాఠశాల ఏజీఎం రాఘవేంద్రరావు హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు బ్యాడ్జీలు, సాషెస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ వీరభద్రరావు, వైస్‌ప్రిన్సిపాల్ మౌనిక, ఏఓ సతీష్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ పద్మలత పాల్గొన్నారు.

జీవితంలో బాధ్యతాయుతంగా ఉండడం అలవర్చుకోవాలి

బాలాజీచెరువు: విద్యార్థి దశ నుంచే బాధ్యతాయుతంగా ఉండడం అలవర్చుకోవాలని ఎన్‌సీసీ మూడో బాలికల బెటాలియన్ కల్నల హరిందర్ సింగ్‌మానిక్ పేర్కొన్నారు. లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో సోమవారం బాధ్యతాయుత నాయకుల ప్రమాణ స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిందర్ సింగ్ మానిక్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటే జీవితంలో ఉన్నతంగా రాణించగలరన్నారు పాఠశాల డైరెక్టర్ సుగుణారెడ్డి మాట్లాడుతూ స్కూల్ హెడ్‌బాయ్, గర్ల్‌గా నియమితులైన వారు బాధ్యతయుతంగా ఉండాలని, తమ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ దిశానిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వందనబోత్రా, వైస్ ప్రిన్సిపాల్‌గా హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

కాపు ఉద్యోగ సేవా సమితి నూతన అధ్యక్షుడిగా బొజ్జా శ్రీనివాస్


శ్రీనివాస్‌ను అభినందిస్తున్న కాపు ఉద్యోగులు

కాకినాడ రూరల్: కాపు ఉద్యోగ సేవా సమిత నూతన అధ్యక్షుడిగా విద్యుత్‌శాఖ లైన్‌మన్‌గా పని చేస్తున్న బొజ్జా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడ కాపు కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన కాపు ఉద్యోగ సేవా సమితి విస్తృత కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సేవా సమితి ఆర్థిక కార్యదర్శిగా నున్న సత్యనారాయణ ఎన్నికయ్యారు. సమావేశంలో కాపు ఉద్యోగులు కనపర్తి నూకరాజు, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, రంగనాయకులు పాల్గొన్నారు.

హెపటైటిస్ వ్యాధితో జాగ్రత్తగా ఉండాలి

బోట్‌క్లబ్: హెపటైటిస్ వ్యాధి వస్తే జాగ్రత్తగా ఉండాలిన ప్రముఖ గాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వెంకన్నబాబు అన్నారు. స్థానిక సాయిభార్గవ స్కానింగ్ సెంటర్‌లో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెపటైటిస్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ , సభ్యులు శ్రీవల్లీ, యేరూష, చిట్ల కిరణ్ పాల్గొన్నారు.

మోడ్రన్ పెంటాథలాన్ పోటీల్లో జిల్లాకు పతకాలు


పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): విజయవాడలో ఈనెల 26, 27 తేదీల్లో మోడ్రన్ పెంటాథలాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనపరచి వివిధ కేటగిరిల్లో 10 పతకాలు సాధించారని డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ అప్పలనాయుడు సోమవారం తెలిపారు. అండర్-11 విభాగంలో సీహెచ్ సాగ్నిక బంగారు, అండర్-13 బాలికల విభాగంలో ఎం.యశశ్విని కాంస్య, అండర్-15 బాలికల విభాగంలో సీహెచ్ హిమద్యుతి రజత పతకాలు అందుకున్నారన్నారు. అండర్-11 బాలుర విభాగంలో కార్తికేయ బంగారు, అండర్-13 బాలుర విభాగంలో సాయి చరణ్, కృతిక్‌లు చెరో బంగారు, అండర్ -17 బాలురు విభాగంలో రజత, కాంస్య పతకాలు కై వశం చేసుకున్నారని పేర్కొన్నారు.

పేద వర్గాల అభ్యున్నతికే పీ-4

కరప: పేద వర్గాల ప్రజల అభ్యున్నతి కోసమే ప్రభుత్వం పీ-4 కార్యక్రమాన్ని నిర్వహించనుందని కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటుచేసిన పీ-4 అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏఓ బీఎల్ నరసింహం, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి పాల్గొన్నారు.

పన్నుల వసూలుకు ఆన్‌లైన్

- గ్రామాల్లో కూడా ఆన్ లైన్‌లోనే ఇంటి పన్నుల వసూలు!
- స్వర్ణ పంచాయత్ పేరిట పల్లెల్లో ఇంటి పన్నుల వివరాలు అప్‌గ్రేడేషన్
- రెండు నెలల క్రితమే ప్రక్రియ ప్రారంభం
- తప్పులు దొర్లడంతో రీవెరిఫికేషన్
- ఆగస్టు నుంచి ఆన్‌లైన్ ద్వారా వసూలుకు ఏర్పాట్లు పూర్తి


రమణయ్యపేట గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల అసెస్‌మెంట్ నంబర్లు రీ వెరిఫికేషన్ చేస్తున్న సిబ్బంది

కాకినాడ రూరల్: పట్టణాలు, నగరాలు మాదిరిగా ఇంటి పన్నులు ఇకపై ఆన్‌లైన్ ద్వారా చెల్లించుకునే వెసులుబాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు రానుంది. స్వర్ణ పంచాయత్ పేరిట ఇంటి పన్నులకు సంబంధిత యాప్‌లో ఆస్తుల అసెస్మెంట్ నంబర్లను ఆన్‌లైన్ ద్వారా అప్‌గ్రేడేషన్ ప్రక్రియ గ్రామ పంచాయతీలలో చురుగ్గా సాగుతోంది. వాస్తవానికి రెండు నెలల క్రితమే ఈ ప్రక్రియ జరగగా చాలా చోట్ల ఆన్‌లైన్‌లో అప్‌గ్రేడేషన్‌లో తప్పులు దొర్లాయి. ఒక అసెసెమెంట్ నంబరు చూసే పేరు వేరే రావడం, వాస్తవ పన్ను కంటే తక్కువగానో, ఎక్కువగానో రావడం గుర్తించారు. రీ వెరిఫికేషన్ ప్రక్రియను చేపడుతున్నారు. కాకినాడ రూరల్‌లోని గ్రామ పంచాయల్లో ఈ ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తయితే 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించుకునే వెసులుబాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు కలుగుతోంది. స్మార్ట్ ఫోన్ల ద్వారా వారే సొంతంగా జమ చేసుకోవచ్చు.


స్వర్ణ పంచాయత్ యాప్

బిల్లు కలెక్టర్ల చేతి వాటానికి చెక్

కొన్ని పంచాయతీలలో ప్రజల నుంచి ఇంటి పన్నులు వసూలు అయినా అవి సక్రమంగా పంచాయతీలకు జమ అయ్యేవి కావు. కొందరు బిల్లు కలెక్టర్లు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది ఇంటి పన్నులు సొమ్ములను పక్కదారి పట్టించేవారు. రశీదులు సక్రమంగా ఇచ్చేవారు కాదు. కొన్ని సందర్భాల్లో కోర్టు, పోర్టు స్టేషన్లలో మెయిల్ నిమిత్తం సాల్వెన్సీలకు గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడేవారు. ఇంటి పన్ను చెల్లిస్తేనే సాల్వెన్సీ ఇస్తామని పంచాయతీ అధికారులు తేల్చి చెప్పడంతో తాము చెల్లిన పన్ను రశీదులు కనిపించక ఇబ్బందులు పడేవారు. ఆన్‌లైన్ చెల్లింపులు ద్వారా అసెస్‌మెంట్ నంబరు ఆధారంగా పన్ను డిమాండ్, చెల్లింపు వివరాలు క్షణాల్లో తెలిసే అవకాశం ఉంది.

ఆన్‌లైన్‌లో ఇంటి పన్నులకు అవకాశం

స్వర్ణ పంచాయత్ యాప్ ద్వారా ఇంటి పన్నులను గ్రామీణ ప్రాంత ప్రజలు చెల్లించుకునే వీలు దక్కుతుంది. ఇంటి పన్ను అసెస్‌మెంట్ నంబర్లును అప్‌గ్రేడేషన్ చేస్తున్నాం. కాకినాడ రూరల్‌లో 2025- 26కు గాను ఇంటి పన్నులు ఏటా సుమారు రూ.9.7కోట్లు వరకు చెల్లిస్తున్నారు. ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో చెల్లింపుల కోసం ప్రక్రియ అన్ని చోట్ల జరుగుతుంది.

– సీతారామాజంనేయులు, ఈఓ పీఆర్ అండ్‌ఆర్డీ, కాకినాడ రూరల్

78శాతం అప్‌గ్రేడేషన్

స్వర్ణ పంచాయత్ యాప్‌లో ఇంటి పన్నుల అసెస్‌మెంట్ నంబర్లు అప్‌గ్రేడేషన్ కాకినాడ రూరల్ మండలంలో సుమారు 78శాతం పూర్తయ్యింది. మండలంలో మొత్తం 41,897అసెస్‌మెంట్లకు గాను ఇప్పటికీ 32,703 అసెస్‌మెంట్లు అప్‌గ్రేడేషన్‌తోపాటు రీ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. నెలాఖరుకు మరో మూడు రోజులు మాత్రమే ఉండడంతో మిగిలిన 22 శాతం అసెస్‌మెంట్లు ప్రక్రియ అప్‌గ్రేడేషన్, రీ వెరిఫికేషన్ కష్టమని పంచాయతీలలో సిబ్బంది పేర్కొంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పంచాయతీలలో ఈ ప్రక్రియపైనే సిబ్బంది కష్టించి పని చేస్తున్నారు.

అధ్యాపకులు బోధన శైలి అభివృద్ధి చేసుకోవాలి

జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్


కార్యక్రమంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అధ్యాపకులు బోధన శైలిని అభివృద్ధి చేసుకోవాలని, విద్యార్థుల్లో ఆచరణాత్మక ఆలోచన, పరిశోధన దృక్పథం పెంపొందించాలని జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో సోమవారం ఎలక్ట్రానిక్స్ ఐసీటీ అకాడమీ, ఎన్ఐటీ వరంగల్ సంయుక్తంగా లెవరేజింగ్ ఓబీఈ ఫర్ కంటిన్యూస్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ అంశంపై వారం రోజుల పాటు నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభించారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం ప్రకారం అధ్యాపకులు సిలబస్ రూపకల్పనలో తగిన మార్పులు చేసుకోవాలని, విద్యానాణ్యతను మెరుగుపర్చే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్, మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాద రాజు, ఎలక్ట్రానిక్స్ ఐసీటీ అకాడమీ చీఫ్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ రాధాకృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ లీలాకుమారి, అనుబంధ కళాశాలల నుంచి 135 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యువవాహిని అభివృద్ధికి కృషి


గోపాలనరసరాజుకు శ్రీకృష్ణ అవార్డు అందిస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్

బోట్‌క్లబ్: శ్రీకృష్ణ యువవాహిని పటిష్టతకు, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. సత్కళావాహిని నూతన కార్యదర్శిగా సోమవారం కె.దివిజేంద్ర బాధ్యతలు స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథి పాల్గొన్నారు. ఎంతో మంది యువ కళాకారులకు సత్కళావాహిని ఎంతో అండగా ఉంటుందన్నారు. గాత్ర సంగీతం, సంగీతం నేర్చుకునే యువ కళాకారులను సత్కళావాహిని అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాయిద్య సమ్మేళనం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సత్కళావాహిని అధ్యక్షుడు ఎస్‌వీ గోపాలనరసరాజుకు శ్రీకృష్ణ అవార్డు అందించారు. యువవాహిని ఉపాధ్యక్షుడు గరికపర్తి నమశ్శివాయ 108 పాద శివలింగాలను, ఆధ్యాత్మిక గ్రంథాలను ముఖ్యఅతిథులకు, సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో యువవాహిని కన్వీనర్ తురగా సూర్యారావు, సత్కళావాహిని ఉపాధ్యక్షురాలు గుజ్జరి కాత్యాయిని, సహకార్యదర్శి చిక్కాల సరోజిని, సంస్థ అడ్వైజర్ ఉద్దగా సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు


గర్భిణులకు చీరలు, డ్రైఫ్రూట్స్ కిట్లు అందిస్తున్న ప్రముఖులు

కాకినాడ సిటీ: స్థానిక ముత్తానగర్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్‌లో రోటరీ క్లబ్ కాకినాడ ఎలైట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం 250 మంది విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సౌజన్య ద్వారంపూడి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లులు 30 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు, డ్రైఫ్రూట్స్ కిట్లు, చీరలు అందజేశారు. అదేవిధంగా పాఠశాలలో పని చేస్తున్న ఆయాలకు చీరలు, నగదు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ కాకినాడ ఎలైట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పవన్, సెక్రటరీ స్రవంతి, ట్రెజరర్ చంద్రశేఖర్, డాక్టర్ దీప్తి అమర్ సేవలందించారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.రవి, సీనియర్ లీడర్స్ కృష్ణమోహన్, లంకే లెనిన్, లంకే సునీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పినపోతు రామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎండీ మున్నిరున్నీషా, ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

బోట్‌క్లబ్: కాకినాడ గిల్డ్ ఆఫ్ సర్వీస్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌కు చెందిన 1981-87 పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆత్మీయ సమ్మేళనం స్థానిక కాస్మోపాలిటీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. సుమారు 45 సంవత్సరాలు గడుస్తున్నా విద్యార్థుల్లో ఆ స్నేహభావం పరిచయాలు పదిలంగా ఉన్నాయి. అలనాడు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువుకున్న పాఠశాలకు అవసరమైన సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఆత్మీయ సమ్మేళనంలో అందరూ ప్రకటించారు. ఉషాబాలా, వెంకటలక్ష్మి, నాగ వేణు ,భాను, ప్రసన్న సత్యవేణి ,పద్మ, శ్యామల, సత్యవతి, జ్యోతి, కల్యాణి, మంగతాయారు, పి.ప్రసాద్, వి.సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, సాయిరాం, ఆలీ, జోయల్, ఎన్.శ్రీను, కరీం, బ్రహ్మజీ, డి.అప్పారావు, ఉదయ్, శామ్యూల్, సుధాకర్, కందాళం రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం


విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న రామకృష్ణ

బోట్‌క్లబ్: గుండెపోటుతో అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తులకు సకాలంలో సీపీఆర్ చేస్తే వారు బతికించే అవకాశం ఎక్కువని రోటరీ గవర్నర్ వై.కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. రోటరీగోల్డెన్ జూబ్లీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అక్షర పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు సీపీఆర్ శిక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి పాఠశాల్లోను 9, పదో తరగతి విద్యార్థులకు క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. గుండె ఆగిపోయినప్పుడు ఎలా స్పందించాలి, ఎలా సహాయమందించాలి, సహాయం కోసం ఎలా పిలవాలి వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్, ఇండియన్ రెస్పిటేషన్ కౌన్సిల్ ఫెడరేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నారు. స్కూల్ ఉపాధ్యాయులకు కూడా ఇంటర్నల్ ట్రైనర్లగా ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. సీపీఆర్ కమిటీ చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి యువత ప్రాణ రక్షకుడిగా మారాల్సిన అవసరం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతీ స్కూల్లో ఈ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కోసం 98854 72314 నంబర్‌లో సంప్రదించవచ్చునన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి క్లబ్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్, ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్‌కేర్ మెడిసిన్ జాతీయ అధ్యక్షుడు సామవేదం శ్రీనివాస్, ఇండియన్ రిసస్పిటేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఎస్ఎస్ సి.చక్రరావు, క్లబ్ కార్యదర్శి సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ్ చక్రవర్తి పాల్గొన్నారు.

మూల భావనారాయణస్వామికి వెండి మకర తోరణం


వెండి మకర తోరణం సమర్పించిన దాతలు


భావనారాయణ స్వామికి వెండి కంచం బహూకరిస్తున్న దాతలు బదరీనారాయణ, శేషారత్నం దంపతులు

కాకినాడ రూరల్: సర్పవరం రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో మూల భావనారాయణ స్వామి వారికి 10 కేజీల వెండితో తయారు చేయించిన మకర తోరణాన్ని విశాఖపట్నంలోని ఎస్ ఆర్ పురం శ్రీ వెంకటాచార్య వేదిక సంస్థానం సమర్పించింది. సుమారు రూ.12 లక్షల విలువైన వెండితో దీనిని తయారు చేయించారని ఆలయ ఈఓ సూర్యనారాయణ సోమవారం తెలిపారు. ఇదిలా ఉండగా భావనారాయణ స్వామి వారికి నిట్టాల బదరీ నారాయణ, శేషారత్నం దంపతులు కేజీ వెండితో తయారు చేయించిన కంచం సమర్పించారు. దీని విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని ఈఓ తెలిపారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


కుమార రామభీమేశ్వరస్వామి

సామర్లకోట స్థానిక పంచారామ క్షేత్రంలో కుమార రామభీమేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతైన రోజు శ్రావణ మాసం కావడంతో ఆలయంలోని స్వామి, అమ్మవార్లకు, ఉప ఆలయాలోను అర్చకులు పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలైన్‌లో భక్తులు వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రసాదం అందజేశారు. ఆలయ పండితులు అల్లకి రాజ్‌గోపాల్ శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పూజలు అనంతరం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. అదే విధంగా స్థానిక మఠంసెంటర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలోను, ఐదు తూముల వద్ద రామలింగేశ్వరస్వామి ఆలయంలోను, గొంచాల, పీబీ దేవం గ్రామాలల్లో వేంచేసి ఉన్న శివాలయంలోను పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాగా ఆగస్టు ఒకటి, 15 తేదీల్లోని శుక్రవారాలు ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఉంటాయని ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు.

ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించిన కలెక్టర్


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: స్థానిక కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జేసీ రాహుల్ మీనా, డీఆర్వో వెంకటరావులతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ నిషేధించిన నేపథ్యంలో రూ.1.60 లక్షల వ్యయంతో వెయ్యి లీటర్ల సామర్థ్యం ఉన్న ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఎస్.రామమోహన్, శివ, అధికారులు పాల్గొన్నారు.

అకడమిక్ క్యాలెండర్ ఆవిష్కరించిన శేషారెడ్డి


క్యాలెండర్ ఆవిష్కరించిన శేషారెడ్డి, చిత్రంలో నూతన కార్యవర్గం

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల అకడమిక్ క్యాలెండర్ 2025-26ను ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి సోమవారం కాకినాడలోని జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. వ్యాయామ ఉపాధ్యాయులకు అవసరమైన పూర్తి సమాచారాన్ని ఈ క్యాలెండర్‌లో పొందుపరచినట్టు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్ తెలిపారు. ప్రముఖ వ్యాపార వేత్త యాక్స్ టైలర్స్ ఈ క్యాలెంటర్‌ను స్పాన్సర్ చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి.మాచరరావు, ట్రెజరర్ కె.నాగలింగేశ్వరరావు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు కె.శ్రీనివాస్, వై.బంగార్రాజు, కె.పట్టాభిరామ్, ఎల్.రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజల అవసరాలు తీర్చడమే రోటరీ లక్ష్యం


రోటరీ ఫౌండేషన్‌కు విరాళం అందిస్తున్న రోటరీక్లబ్ కాకినాడ సభ్యులు

బోట్‌క్లబ్: సమాజంలో ప్రజలు అవసరాలను తీర్చడమే రోటరీ లక్ష్యమని రోటరీ గవర్నర్ వై.కల్యాణ్ చక్రవర్తి అన్నారు. అధికారిక పర్యటనలో భాగంగా సోమవారం ఆయన రోటరీక్లబ్ కాకినాడను సందర్శించారు. ఈ సందర్భంగా తడాల బుజ్జి ఆధ్వర్యంలో స్థానిక అన్నయ్యపేటలోని జల కల్యాణం పేరుతో క్లబ్ నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. మహేష్‌బాబు ఫౌండేషన్ సహాయంతో పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. మహిళలకు కుట్టుమెషీన్లు అందించారు. అనంతరం రోటరీ ఫౌండేషన్‌కు రవితేజ రూ.3.57 లక్షల విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్లు ఎల్.సత్యనారాయణన్, క్లబ్ సెక్రటరీ గోడే సత్య, అసిస్టెంట్ గవర్నర్ సురభి శారద పాల్గొన్నారు.

క్రీడాకారుల విశ్రాంతి రూముల పరిశీలన

సామర్లకోట: ఆగస్టు ఒకటో తేదీ నుంచి 12వ తేదీ వరకూ కాకినాడలో జరగనున్న జూనియర్ జాతీయ హాకీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు విశ్రాంతి తీసుకోవడానికి ఏర్పాటు చేసిన రూములను తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖర రెడ్డి సోమవారం పరిశీలించారు. 29 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ మేరకు 200 మంది క్రీడాకారులు సామర్లకోటలో విశ్రాంతి తీసుకొనే విధంగా ఏర్పాటు చేయాలని కాకినాడ ఆర్డీఓ ఎస్. మల్లిబాబు ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలల్లో రూములను పరిశీలించారు. దీనిలో భాగంగా విస్తరణ శిక్షణా కేంద్రంలో 40 మంది, టీటీడీసీలో 80 మంది, సర్వే అకాడమిలో 80 మంది విశ్రాంతి తీసుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయా గ్రేడ్‌లను బట్టి ఉన్నతాధికారులు రూములు కేటాయిస్తారని తెలిపారు. ప్రతి రోజు క్రీడాకారులు కాకినాడ వెళ్లి రూములకు తిరిగి వస్తారని తహసీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్వేయర్ వై.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మూడు జోన్లుగా పట్టణ విభజన

సామర్లకోట: పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేలా పట్టణాన్ని మూడు జోన్లుగా విభజించడానికి అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం పోలీసు, టౌన్ ప్లానింగ్ అధికారులతో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు రెడ్ జోన్, గ్రీన్ జోన్, అంబర్ జోన్ ప్రాంతాలను పోలీసుల సమక్షంలో నిర్ణయంచారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాన్ని రెడ్ జోన్‌గా నిర్ణయించారు. ఈ జోన్‌లో రోడ్లపై వ్యాపారాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు రెడ్ జోన్ ప్రాంతాల్లో పూర్తి రోడ్లపై వ్యాపారాలను నిషేధించినట్టు తెలిపారు.

ఏడీబీరోడ్డు, సామర్లకోట-కాకినాడ, సామర్లకోట- రాజమహేంద్రవరం, రిజిస్ట్రేషన్ కార్యాలయ సెంటర్, రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్, స్టేషన్ సెంటర్ నుంచి విఘ్నేశ్వర థియేటర్, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, స్టేషన్ సెంటర్ నుంచి ఎన్‌టీఆర్ స్కూల్, గాంధీబొమ్మ సెంటర్ నుంచి బ్రౌన్‌పేట రోడ్డు, బల్ల మార్కెట్ నుంచి ఎన్టీఆర్ స్కూల్, గోలివారి వీధి నుంచి మఠంసెంటర్, మఠంసెంటర్ నుంచి ప్రెసిడెంట్ గారి వీధి, నీలమ్మ గుడి నుంచి తెలుకులపుంత రోడ్డు, తెలుకులపుంత నుంచి పోలీసుస్టేషన్ రోడ్డు, మెహర్ కాంప్లెక్స్ నుంచి పెద్దాపురం రోడ్డు, బ్రౌన్‌పేట నుంచి ప్రతిపాడు జంక్షన్ వరకు రెడ్ జోన్లుగా గుర్తించినట్టు ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తెలిపారు.

గ్రీన్ జోన్‌గా ఎంపిక చేసిన ప్రాంతాలలో వీధి వ్యాపారులకు ఎటువంటి నిషేధం లేదన్నారు. రైల్వే కల్యాణ మండపం నుంచి గాంధీచౌక్, ఎన్టీఆర్ స్కూల్ నుంచి నీలమ్మ గుడి, నంబరు 1 మార్కెట్, నంబరు 2 మార్కెట్, కోట్లమ్మ ట్యాంకు రోడ్డు, ప్రతిపాడు జంక్షన్ నుంచి రాజీవ్ గృహ కల్ప వరకు గ్రీన్ జోన్‌గా ఎంపిక చేశారని చెప్పారు. అంబర్ జోన్‌లో టౌన్ ప్లానింగ్ కమిటీ వ్యాపారాలు చేసుకోవడానికి నిర్ణయించిన రోజులు, సమయాల్లో మాత్రమే వ్యాపారాలు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని గరగారావు తెలిపారు. గడియారం స్తంభం నుంచి రైల్వే కల్యాణ మండపం, రథం సెంటర్ నుంచి రైల్వే కల్యాణ మండపం, బళ్లమార్కెట్ నుంచి సత్య కృష్ణ థియేటర్‌రోడ్డు, విఘ్నేశ్వర థియేటర్ నుంచి మెహర్ కాంప్లెక్స్, గాంధీ నగర్ నుంచి గౌతమ్ మోడల్ స్కూల్ వరకు అంబర్ జోన్‌గా అధికారులు గుర్తించారని చెప్పారు. ఈ మేరకు నిర్ణయం తీసుకోవాల్సిన ఉందన్నారు. ఇటీవల మున్సిపల్ ఆర్డీ కాకినాడ జిల్లాలోని మున్సిపల్ అధికారులకు సామర్లకోటలో నిర్వహించిన సమావేశంలో జోన్లు విభజన జరగాలని సూచించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే దీనిపై కౌన్సిల్ అంగీకారం కావలసి ఉంది. చైర్‌పర్సన్ వివాదం కోర్టులో ఉన్న కారణంగా గత మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు జరగడం లేదు. దాంతో ఏ విధంగా నిర్ణయం ఉంటుందో వేచి చూడాలి. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.